స్వచ్ఛతకు తూట్లు

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- మూలనపడ్డ చెత్త తరలించే ఆటో, రిక్షాలు

కదిరి అర్బన్‌: స్వచ్ఛ భారత్‌ సంకల్పానికి కదిరి మండలంలో అధికారులు తూట్లు పొడిచారు. ఏ గ్రామం చూసినా అపరిశుభ్రతే దర్శనమిస్తోంది. రోడ్లపైనే చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మండల వ్యాప్తంగా 12 పంచాయతీల్లో చెత్త సేకరించే రిక్షాలు 50 ఉన్నాయి. అయితే ఇందులో 90 శాతానికి పైగా రిక్షాలు పనిచేయడం లేదు. మూలన చేరాయి. ఇక ఆటో రిక్షాలు ఐదు ఉంటే అందులో ఒకటి మాత్రమే వినియోగిస్తున్నారు.

నిరుపయోగంగా చెత్త కేంద్రాలు

గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఇంటింటి సేకరించిన తడి చెత్త, పొడిచెత్తను ఎరువుగా తయారు చేసి సంపద సృష్టించాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలో 12 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు ఉన్నా కొన్ని మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన వాటి గురించి పట్టించుకునేవారు లేరు.

కనిపించని క్లాప్‌ మిత్రలు

గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు నియమించిన క్లాప్‌ మిత్రలకు జీతాలు సకాలంలో చెల్లించడం లేదు. పనిచేసినా జీతం రాకపోవడంతో కుటుంబాలను పస్తులు ఉంచలేక పలువురు క్లాప్‌మిత్రలు ఇతర పనులు చేసుకుంటున్నారు. దీంతో చాలాచోట్ల చెత్తసేకరణ ఆగిపోయింది.

ఫాగింగ్‌ జాడేదీ..?

వర్షాకాలం అంటేనే వ్యాధులు ప్రబలే కాలం. దోమల కారణంగా ప్రజలు వివిధ రోగాల బారినపడే ప్రమాదముంది. దోమల నివారణకు పంచాయతీల పరిధిలో ఫాగింగ్‌ చేయాల్సి ఉన్నా ఇంతవరకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు.


ముత్యాల చెరువు పంచాయతీ ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో రోడ్డుపైనే పడేసిన చెత్త


కుమ్మరవాండ్లపల్లిలో చెడిపోయిన ఆటో రిక్షా

సేకరించకపోతే రోడ్లపైనే చెత్త



పారిశుధ్య సిబ్బంది ఇంటికి వచ్చి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుంది. వారు రాకపోవడంతో వీధిమూలన రోడ్డుపైనే చెత్త పడేస్తున్నారు. దీంతో చెత్తదిబ్బల నుంచి దుర్గంధం వెదజల్లుతోంది.

– రామ్మోహన్‌, గట్లు

త్వరలో క్లాప్‌మిత్ర ఖాళీల భర్తీ



మండలంలో చాలావరకు చెత్త సంపద తయారీ కేంద్రాలు పని చేస్తున్నాయి. క్లాప్‌ మిత్రలు గతంలో 37 మంది ఉండేవారు. ప్రస్తుతం ఏడుగురే పని చేస్తున్నారు. జీతాల సమస్యతో మిగిలిన వారు వెళ్లిపోయారు. త్వరలోనే క్లాప్‌ మిత్ర ఖాళీలను భర్తీ చేస్తాం. దోమలను అరికట్టేందుకు ఫాగింగ్‌ చేపడతాం.

– పోలప్ప, ఎంపీడీఓ, కదిరి

క్లుప్తంగా

భవిత కేంద్రం తనిఖీ


భవితకేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్‌ శర్మ

కదిరి అర్బన్‌: స్థానిక జెడ్పీ హైస్కూల్‌ ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీఓ వీవీఎస్‌ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న చిన్నారుల వికలత్వానికి సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులు అన్వేష్‌, సౌజన్యను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు చేస్తున్న ఫిజియోథెరపీ పరీక్షలను పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థులకు పింఛన్‌ వస్తోందా అని ఆరా తీశారు. విద్యార్థులు జాగ్రత్తగా చూసుకోవాలని అక్కడ ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రూపేష్‌నాయక్‌, శ్రీదేవితో పాటు పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని 2, 3, 4 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సూపర్‌వైజర్‌ చంద్రమ్మ ఆధ్వర్యంలో మూడేళ్లు నిండిన చిన్నారులకు ప్రీస్కూల్‌ సంసిద్ధత, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను ఖచ్చితంగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని సీడీపీఓ తల్లులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలు, విద్యతో పాటు పిల్లలకు మంచి పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. పిల్లలలో సమగ్ర అభివృద్ధి జరగాలంటే 3–6 సంవత్సరాలు కీలకదశ అన్నారు. ఉచితంగా పిల్లలకు పీ1, పీ2 విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపు కోవాలి


మాట్లాడుతున్న సీఐ శ్యామ్‌రావు

తాడిమర్రి: గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ముదిగుబ్బ రూరల్‌ సీఐ శ్యామ్‌రావు ప్రజలకు సూచించారు. ఎం.అగ్రహారం గ్రామంలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకే గ్రామానికి వెళ్లి అనుమానితుల ఇళ్లు, దొడ్లు, పాడుబడిన ఇళ్లలో మారణాయుధాల కోసం సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామస్తుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే పీర్ల పండుగల్లో ఎలాంటి ఘర్షణలు, గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపు కోవాలన్నారు. మట్కా, పేకాట, క్రికెట్‌ బెట్టింగ్‌, అక్రమ మద్యం రవాణా తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తాడిమర్రి, పట్నం ఎస్‌ఐలు కృష్ణవేణి, రాజశేఖర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో మలేరియా నివారణ


పాఠశాల గదిలో మలాథియాన్‌ స్ప్రే చేయిస్తున్న అధికారులు

గాండ్లపెంట: దోమల నిర్మూలనతో మలేరియా నివారించవచ్చని వైద్యాధికారి మహేశ్వరమారుతి, మలేరియా సబ్‌యూనిట్‌ అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా శుక్రవారం కటారుపల్లి క్రాస్‌లోని కస్తూర్బా పాఠశాలలో మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా ఎలా వ్యాపిస్తుంది, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు పాఠశాలలోని అన్ని గదుల్లో మలాథియాన్‌ను పిచికారీ చేయించారు. మలేరియా, స్థానిక ఆరోగ్య సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యుత్‌ బెల్‌ వితరణ

ఓడీచెరువు: స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు ఓడీచెరువుకు చెందిన నాయని అశ్వర్థ నారాయణ, భాగ్యలక్ష్మి దంపతులు, వేమారెడ్డి పల్లికి చెందిన నరసింహారెడ్డి, రమణమ్మ దంపతులు రూ.10 వేలు విలువైన విద్యుత్‌ బెల్‌ను వితరణ చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ, విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు .

వేద విద్వన్మహా సభలు ప్రారంభం


గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్‌: స్థానిక దత్తా ఫంక్షన్‌ హాల్‌లో శుక్రవారం ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో జనార్ధనానంద సరస్వతీ వేద విద్వన్మహా సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అదర్వణ వేదాలకు చాలా శాఖలు ఉన్నాయని, కాలక్రమేణా ఆ శాఖలు అన్నీ తగ్గిపోయాయన్నారు. ఈ వేదశాస్త్రాలన్నింటిని రక్షించడం భారతీయుల కర్తవ్యమన్నారు. రెండు తెలుగురాష్ట్రాల్లో వేద విద్య, వేద పండితులను ప్రొత్సహించాలన్నారు. తొలిరోజు గో పూజతో ప్రారంభమైన ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు జరగనుంది. కార్యక్రమానికి వేద విద్వాంసులు కుప్పా విశ్వనాథశర్మ, హనుమంతువజుల మారుతీశర్మ, ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం నాయకులు బాబు ప్రకాష్‌, కృష్ణాచార్‌, పాపయ్యశాస్త్రి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్‌

బత్తలపల్లి: రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ప్రతి అధికారి ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించి పెండింగ్‌ సమస్యలు లేకుండా చూడాలని ఆర్డీఓ మహేష్‌ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ పనితీరును సమీక్షించారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన బాధ్యతగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. అలస్యం లేకుండా పారదర్శకతతో ప్రజలకు సేవలదించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపైన ఉందని స్పష్టం చేశారు. రెవెన్యూ రిజిస్టర్లు, పెండింగ్‌ సర్వీసెస్‌, పెండింగ్‌ అర్జీలను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్‌ స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఓకు వీడ్కోలు


ఏఓ ఉదయ్‌ కుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్విర్తిస్తున్న ఉదయ్‌ కుమార్‌ కర్నూలు జిల్లా డోన్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం వ్యవసాయాధికారి కార్యాలయంలో ఉదయ్‌ కుమార్‌కు సన్మాన సభ నిర్వహించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది ఆయన్ను శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగ్‌, గేమింగ్‌ యాప్స్‌ను నిషేధించాలి

పుట్టపర్తి: బెట్టింగ్‌ యాప్స్‌, ఆన్‌లైన్‌ గేమ్స్‌తో యువత భారీగా నష్ట పోతున్నారని, వాటిని వెంటనే నిషేధించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్ర ప్రసాద్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బెట్టింగ్‌ యాప్స్‌, ఆన్‌లైన్‌ గేమ్స్‌తో తీవ్రంగా నష్టపోయిన యువకులు కొంత మంది ఆత్మహత్యకు సైతం పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి పిల్లలు ఇలాంటి వాటిలో నష్ట పోవడంతో కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని పేర్కొన్నారు. సమాజానికి ఇలాంటివి ప్రమాదకరమని తెలిపారు. దేశ సమస్యగా భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని నిషేధించాలని డిమాండ్‌ చేశారు.

క్షయపై అవగాహన


టీబీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్‌: వరిగిరెడ్డిపల్లిలో శుక్రవారం టీబీ సూపర్‌వైజర్‌ శ్రీనివాసులు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం ఉన్న వారు గళ్లపరీక్ష చేసుకోవాలని ప్రజలకు సూచించారు. టీబీ బాధితులకు ఆరు నెలలు మందులు ఉచితంగా ఇస్తారన్నారు. పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 చొప్పున ఇస్తారని తెలిపారు.

ధర్మవరం ఏడీఏగా లక్ష్మానాయక్‌


బాధ్యతలను స్వీకరిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్‌

ధర్మవరం రూరల్‌: స్థానిక వ్యవసాయ సబ్‌ డివిజన్‌ కార్యాలయంలో నూతన ఏడీఏ లక్ష్మానాయక్‌ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణయ్య బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో రాయదుర్గంలో పనిచేస్తున్న లక్ష్మానాయక్‌ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. కార్యాలయ సిబ్బంది, డివిజన్‌లోని ఏఓలు, సిబ్బంది, ఎరువుల దుకాణాదారులు తదితరులు నూతన ఏడీఏకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం


నూతన బస్‌ సర్వీసును ప్రారంభిస్తున్న ఆర్టీసీ జోనల్‌ చైర్మన్‌ నాగరాజు తదితరులు

పుట్టపర్తి టౌన్‌: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆర్టీసీ పనిచేస్తోందని జోనల్‌ చైర్మన్‌ పూల నాగరాజు, డీపీటీఓ మదుసూధన్‌, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద మూడు సూపర్‌ లగ్జరీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్‌ సర్వీసులు ప్రారంభిస్తున్నామన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

చెరువు కరకట్టలను పటిష్టం చేయండి

నియోజవర్గంలో ప్రతి చెరువు కట్టను పటిష్టం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఇరిగేషన్‌ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె నూతన ఇరిగేషన్‌ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్‌ కౌన్సిల్‌ హాల్లో ఆర్పీలకు నూతన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మున్సిపల్‌కమిషనర్‌ క్రాంతికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- సబ్‌జైల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి భరోసా

పుట్టపర్తి: ఏడాది కాలం నుంచి కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు, చురుకుగా పని చేసే కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తోందని, వాటికి ఏ ఒక్కరూ భయపడొద్దని అన్ని విధాలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పెనుకొండ సబ్‌జైలులో ఉన్న కొత్తచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాండు, ఆకుల అశోక్‌, పెద్దన్న, ఆదినారాయణ, మాసపల్లి అశోక్‌, ఫణి, విజయ్‌, హేమంత్‌ తదితరులను మాజీ ఎమ్మెల్యే శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రెడ్‌ బుక్‌ రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్న కూటమి ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా వైఎస్సార్‌సీపీలో చురుకుగా పని చేసే వారిని లక్ష్యంగా చేసుకొని కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఫిర్యాదు చేసినా ప్రత్యర్థులపై ఎలాంటి కేసు పెట్టకపోవటంపై పోలీసుల తీరును తప్పు పట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ శ్యామ్‌సుందర్‌రెడ్డి, తలమర్ల సింగిల్‌ విండో మాజీఅధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, నాయకులు ఎల్లప్ప, బళ్లారి బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చాలని ఇంజినీరింగ్‌ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న మున్సిపల్‌ ఇంజనీరింగ్‌ కార్మికులు

ధర్మవరం: తమ సమస్యలు తీర్చాలని కోరుతూ మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ కార్మికులు పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, కార్యదర్శి బాబు, కోశాధికారి కాటమయ్య, యోగేష్‌, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌ మాట్లాడుతూ జీఓ 36 ప్రకారం ఇంజినీరింగ్‌ కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. తల్లికి వందనం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు టెక్నికల్‌ కార్మికులకు రూ.29500, నాన్‌ టెక్నికల్‌ రూ.24500 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం మున్సిపల్‌ అధికారులకు వినతిపత్రం అందించారు.

యువకుడు అదృశ్యం


ప్రవీణ్‌కుమార్‌

తనకల్లు: గీతాలవారిపల్లికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ గోపి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడైన ప్రవీణ్‌కుమార్‌ కొక్కంటికి చెందిన ముక్కేసాబ్‌ వద్ద వడ్డీకి రూ.20 వేలు అప్పు చేశాడు. ఈ నెల 26న తన వద్ద తీసుకున్న డబ్బు చెల్లించాలని అప్పు ఇచ్చిన వ్యక్తి అతడిని అడిగాడు. అయితే తన వద్ద డబ్బు లేదని చెప్పడంతో బైక్‌ను బలవంతంగా తీసుకెళ్లాడు. దీంతో మనస్థాపం చెందిన ప్రవీణ్‌కుమార్‌ అదే రోజు నుంచి ఇంటికి వెళ్లకుండా ఎటో వెళ్లిపోయాడు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు 9346917118 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: గుడ్డంపల్లి తండా ప్రాథమిక పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు శుక్రవారం దాత, ఉపాధ్యాయుడు ఎం.ఆంజనేయులు నాయక్‌ సుమారు రూ.10 వేల విలువైన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. తాను చదివిన పాఠశాలకు తన వంతుగా వీటిని పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫకృద్దీన్‌, పాఠశాల చైర్‌పర్సన్‌ శోభారాణి, న్యాయవాది చత్రినాయక్‌, గోపాల్‌ నాయక్‌, శివ, అశోక్‌, రాజేష్‌, సాంబ, హనుమంతు, బాలాజీ, నారాయణస్వామి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం


ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్న నర్సు

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఆసుపత్రిలో 380 మందికి భోజన ప్యాకెట్లు, వాటర్‌ ప్యాకెట్లు అందించారు. గర్భవతులకు ఆసుపత్రి వైద్యులు, నర్సుల చేత స్వీట్లు పంపిణీ చేయించారు. నారాయణసేవలో భాగంగా ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేస్తున్నామని సత్యసాయి సేవా సమితి కన్వీనర్‌ నామా ప్రసాద్‌ తెలిపారు.

వాహనాల తనిఖీ

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని దామాజిపల్లి సమీపంలో 44వ నంబర్‌ జాతీయ రహదారిపై ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్‌ లైసెన్స్‌, కాలుష్యం తదితర రికార్డులను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు లైసెన్స్‌ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. హెల్మెట్‌ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

ప్రాణాలు పోతే గానీ పట్టించుకోరా?


కిందకు వేలాడుతున్న తీగల కింద వెళ్తున్న స్కూలు బస్సు

ధర్మవరం రూరల్‌: మల్కాపురం పంచాయతీలోని ముత్యాలంపల్లి కొట్టాలకు వెళ్లే రహదారిపై విద్యుత్‌ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు నిత్యం ఈ గ్రామానికి వెళ్తుంది. అయితే బస్సుకు తగిలీ తగలనట్లుగా విద్యుత్‌ వైర్లు వేలాడుతున్నాయి. ఒక వేళ బస్సు వెళ్లే సమయంలో ఈదురు గాలులు వీస్తే తీగలు బస్సుకు తగిలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకు పలు సార్లు అధికారులకు విన్నవించినా వారి నుంచి స్పందన లేదన్నారు. పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని విద్యుత్‌ వైర్లను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

తాడిమర్రి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు తమ పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించాలని ఏఓ శేఖర్‌నాయక్‌ రైతులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కంది పంటకు ఎకరాకు రూ.102, హెక్టార్‌కు రూ.255, రాగి, ఆముదం ఎకరాకు రూ.100, హెక్టార్‌కు రూ.250 ప్రకారం జూలై 31లోపు ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం రూ.20 వేల చొప్పున పరిహారం వస్తుందని తెలిపారు. అలాగే వరి పంటకు ఎకరాకు రూ.200 ప్రకారం హెక్టార్‌కు రూ.500 ఆగస్టు 15లోపు చెల్లిస్తే రూ.40 వేలు నష్ట పరిహారం అందుతుందని పేర్కొన్నారు. అలాగే వాతావరణ బీమా కింద ఇఫ్‌కో టోక్యో కంపెనీ కింద ఐదు పంటలకు బీమా అందిస్తారని తెలిపారు. చీనీ పంటకు ఎకరాకు రూ.2,733 జూలై 15 లోపు చెల్లిస్తే ప్రభుత్వం రూ.55 వేలు, వేరుశనగ పంటకు ఎకరాకు రూ.648 ప్రీమియం చెల్లిస్తే నష్ట పరిహారం రూ.32 వేలు, దానిమ్మ పంటకు ఎకరాకు రూ.3,796 చెల్లిస్తే రూ.75 వేలు, పత్తి ఎకరాకు రూ.1,923 ప్రీమియం చెల్లిస్తే రూ.38 వేలు, టమాట ఎకరాకు రూ.1,619 ప్రీమియం చెల్లిస్తే రూ.32 వేలు నష్ట పరిహారం చెల్లిస్తారని ఆయన వివరించారు. ఈ పంటల ప్రీమియం కూడా జూలై 15లోపు పంట రుణాలు తీసుకున్న బ్యాంక్‌ల్లో ప్రీమియం చెల్లించి వాటి వివరాలను మీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో అందించాలని ఆయన రైతులకు సూచించారు.

సజ్జలను కలిసిన మాజీ శాప్‌ డైరెక్టర్‌


సజ్జల రామకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ శాప్‌ డైరెక్టర్‌ ఓబిరెడ్డి

ధర్మవరం రూరల్‌: వైఎస్సార్‌సీపీ స్టేట్‌ కోఆర్డినేటర్‌ సజ్జల రామకృష్ణారెడ్డిని శుక్రవారం బెంగళూరులోని విమానాశ్రయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ధర్మవరం మండలం చిగిచెర్లకు చెందిన ఏపీ స్పోర్ట్స్‌ అథారిటీ మాజీ డైరెక్టర్‌ బుచ్చిరెడ్డిగారి ఓబిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని ఆయన తనకు సూచించినట్లు ఓబిరెడ్డి తెలిపారు.

ధనకొండ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

తనకల్లు: కనసానివారిపల్లి వద్ద వెలిసిన ధనకొండ గంగమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని గంగమ్మ తల్లికి తమ మొక్కులను తీర్చుకున్నారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు భక్తదులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి, ఆలయ చైర్మన్‌ మారేపల్లి నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సమరసింహారెడ్డి, యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి న్యాయవాది విరాళం


న్యాయవాది దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో నిర్మించిన శివాలయానికి శుక్రవారం న్యాయవాది చిలకం రామకృష్ణారెడ్డి, అనురాధ దంపతులు రూ.50 వేలు విరాళం అందించారు. వారిని షిర్డీసాయిబాబా సేవా సమితి సభ్యులు శాలువాతో సన్మానించారు.

సామూహిక సెలవులో కార్యదర్శులు


ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

గాండ్లపెంట: రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య పిలుపుమేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులో వెళ్లారు. ఈమేరకు శుక్రవారం సామూహిక సెలవు మంజూరు చేయాలని ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను శనివారం జిల్లా కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

కేబుల్‌ చోరీ

పుట్టపర్తి టౌన్‌: వ్యవసాయ పంపుసెట్లకు అమర్చిన కేబుల్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బీడుపల్లి గ్రామంలో నేషనల్‌ హైవే సమీపంలో ఉన్న గోవిందరెడ్డి, వెంకటరంగారెడ్డి, ధనుంజయ రైతులు పొలాల్లో పంపు సెట్లకు అమర్చిన కేబుల్‌ను కొందరు దుండగులు అపహరించినట్లు రైతులు వాపోయారు. తరచుగా కేబుల్‌ చోరీలు జరుగుతున్నాయని, పోలీసులు నిఘా ఉంచి వాటిని అరికట్టాలని కోరుతున్నారు.